క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి, జంగేడు 11/33 కేవీలైన్‌లో సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా మున్సిపల్ పరిధిలో నేడు(శనివారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని భూపాలపల్లి ఏఈ విశ్వాశ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల గ్రామంలోని కస్తూరిబా పాఠశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదులు, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించిన డాక్టర్స్ రెసిడెన్షియల్ క్వార్టర్స్‌ను ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నేడు(శనివారం) ప్రారంభించనున్నట్లు ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వివిధ గ్రామాలకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె కోరారు.

సన్మానం



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ శ్రీనివాస్‌తోపాటు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై శ్రావణ్ కుమార్‌ని, రెండవ ఎస్సై సంధ్యారాణిని వారి, వారి కార్యాలయాల్లో గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేష్, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఆ శాఖ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, కౌన్సిలర్ మంగలిపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు మేనం తిరుపతి, సింగనవేన చిరంజీవి, శ్రీకాంత్, లక్ష్మణ్, సతీష్, రఘురెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాల పంపిణీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర, సూరవీడు, ఆలుబాక, రామచంద్రాపురం, పాత్రాపురం పంచాయతీల్లో శుక్రవారం పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చాలా మంది గిరిజనుల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు, పట్టాలు ఇవ్వలేదని అన్నారు. త్వరలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అందరికీ హక్కు పత్రాలను ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సైయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీలు కొండపర్తి సీతదేవి, జయమ్మ, సర్పంచ్‌లు కారం కన్నయ్య, కృష్ణార్జునరావు అట్టం సత్యనారాయణ, నాయకులు క్రాంతితో పాటు తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



మంగపేట: ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ పరిధిలోని రామచంద్రునిపేట(సంఘంపల్లి)లో వైద్యాధికారి నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్‌ఎం సీతారావమ్మ, ఆశాకార్యకర్త నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల స్థాయి అండర్ 14 క్రీడల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎంఈఓ వెంకటేశ్వరరావు, సెక్రెటరీగా తెల్లం రాజ్యలక్ష్మి, జాయింట్ సెక్రెటరీగా నాగేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి స్వరూప్ సింగ్, తిరుపతి, పద్మ ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మహదేవపూర్: వరదలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాగా, గత సర్వసభ్య సమావేశం నిర్వహించి మూడు నెలలు అయినందునా సమావేశం నిర్వహించామని, కాని పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తుండగా సర్వసభ్య సమావేశం నిర్వహించొద్దని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రవీంద్రనాథ్ తెలిపారు. దీంతో సమావేశం నుంచి ఐదుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు వెళ్లిపోయారు. సమాశానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీధర్ బాబు వివిధ శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు కాటారం డివిజన్‌లోని ఐదు మండలాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం పరిధిలోని సంద్రుపల్లి, నాగేపల్లి, పలుగుల, మద్దులపల్లి, అన్నారంలో భారీ వర్షాల వల్ల సరస్వతి బ్యారెజి గేట్లు ఎత్తడంతో పంటలు మునిగి పోయినట్లు తెలిపారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ గణన పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్: వ్యవసాయ గణనను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ డైరెక్టర్ ప్లానింగ్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రగతి భవన్‌లో 11వ వ్యవసాయ భూమి గణన శిక్షణ తరగతుల్లో డీడీ వెంకటేశ్వర్లు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కమతాల గణన మాన్యువల్‌గా చేసేవారని, ప్రస్తుతం భారత ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో ఎంట్రీ చేయాలన్నారు. రైతుల వారిగా కమతాల వివరాలు సేకరించి నివేదికలు తయారు చేయాలన్నారు. గణాంకాలుగా ఏఈఓలను మొదటిసారి నియమించడం జరిగిందని, పకడ్బందీగా సమాచారం సేకరించి రోజువారి పర్యవేక్షణ అధికారులకు పంపించాలని తెలిపారు. జిల్లాలో మొదటి దశ కమతాల గణన కోసం 45 మంది వ్యవసాయ విస్తరణ అధికారులను ఎన్యూమరేటర్స్‌గా నియమిస్తున్నామని, వీరిని సూపర్వైజర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ నెల 15లోగా సమర్థవంతంగా పూర్తి చేయాలని తెలపారు. ప్రభుత్వం వివిధ అభివృద్ధి ప్రణాళికలను, సామాజిక ఆర్థిక విధానాలను తయారు చేయుటకు వ్యవసాయ గణన కమతాల లెక్కింపు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సామ్యూల్, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సంజీవరావు,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిరంగారావు డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారులు కవిత, అలివేని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల గుర్తింపునకు సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పలిమెల: తల్లి, తండ్రిని కోల్పోయి అనాథలుగా మారిన 23 సంవత్సరాల లోపు అనాథ పిల్లలను గుర్తించేందుకు శుక్రవారం పలిమెల గ్రామంలో అధికారులు ఆర్ఫాన్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, మండల ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ సురేందర్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన నాయకులు



గవర్నర్‌తో బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్: వరదలకు మోరంచపల్లి గ్రామంతో పాటు నియోజకవర్గంలో పలు గ్రామాలు నీట మునగడంతోపాటు జరిగిన నష్టాన్ని గవర్నర్ తమిళసై దృష్టికి తీసుకెళ్లినట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నియోజకవర్గం ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నరును బీజేపీ నాయకులు కలిశారు. అనంతరం కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. వరదలో జరిగిన నష్టాన్ని గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. బాధితులకు నష్టపరిహారాలు అందే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సహాయ సహకారాలు అందించాలని గవర్నర్‌ను కోరమన్నారు. వరదల విషయాన్ని విని దిగ్భ్రాంతికి లోనయ్యానని ఇంత నష్టం జరగడం బాధాకరమని ఖచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు విధంగా న్యాయం జరిగేటటచూస్తానని గవర్నర్ తెలిపినట్లు తెలిపారు. అలాగే త్వరలోనే జిల్లాలోని పర్యాటక కేంద్రాలను, వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ కోకన్వీనర్ చాడ రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాపయ్య, చదువు రామచంద్రారెడ్డి, భారతీయ మద్దూర్ సంఘ నాయకులు అప్పాని శ్రీనివాస్ తదితరులుఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన ‘మీసేవ’ నిర్వాహకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

కాటారం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ నాగరాజును శుక్రవారం మండలంలోని మీ సేవ కేంద్రం నిర్వాహకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మీ సేవా నిర్వాహకులు మహమ్మద్ జావీద్, గౌరోజు విష్ణుమూర్తి, ఒడేటి రంజిత్, మంథెన శ్రీనివాస్, నరేశ్ ఉన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మొగుళ్లపల్లి: జీఎమ్ఆర్ఎమ్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని రంగాపురం గ్రామంలో సర్పంచ్ బల్గూరి తిరుపతిరావు, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రస్టు జనరల్ సెక్రెటరీ గండ్ర గౌతంరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ లైసెన్సు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా..



చిట్యాల: ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: భారతదేశానికి స్వాతంత్రం లభించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగరవేయాలని ఐటీ మాస్టర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ వేముల శంకర్ కోరారు. ఈ మేరకు ఐటీ మాస్టర్‌లోని విద్యార్థులకు శుక్రవారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా 2.0 కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలని వేముల శంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీ మాస్టర్ డైరెక్టర్ వేముల కుమార్, సిబ్బంది సంగి సురేందర్, ఏకుల సాగర్ పాల్గొన్నారు.

పోస్టల్ సిబ్బంది బైక్ ర్యాలీ

చిట్యాల: అజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా 2.0 క్యాంపేయిన్ పురస్కరించుకుని చిట్యాల పోస్టు మాస్టర్ కళాధర్‌చారి ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ డివిజన్ భూపాలపల్లి సబ్ డివిజన్ కింద చిట్యాల సబ్ పోస్ట్ ఆఫీస్, దాని అనుబంధ బ్రాంచీ పోస్టాఫీసు అన్నింటిలో జాతీయ జెండాలు విక్రయం చేస్తున్నామని తెలిపారు. ఒక్కొక్క జెండా ఖరీదు రూ.25 ఉందని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టుఆఫీస్ సిబ్బంది రాజు, మౌనిక, మనీషా, సందీప్, ప్రవీన్‌రెడ్డి, అనిల్, మొగిలి, రామస్వామి తదితరులు ఉన్నారు.

బస్ పాస్‌ల పంపిణీ



బస్ పాస్‌లు పంపిణీ చేస్తున్న ప్రతిమ రెడ్డి

మహదేవపూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు బస్ పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు ప్రసాద్, సమ్మయ్య, సదాశివ్, రమేష్, సంధ్య, శ్వేత పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లాపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్పంచ్ రజిత, పంచాయతీ కార్యదర్శి అనూష ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న కలలను బయటకు తీయడానికి ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని రాఘవరెడ్డిపేటలో పలు కారణాలతో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి శుక్రవారం పరామర్శించారు. తుమ్మల సుగుణమ్మ, బొల్లెపెల్లి కొమురయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవిగౌడ్, ఆకునూరి తిరుపతి, చదువు మధురమహేందర్‌రెడ్డి, పెరుమాండ్ల మొగిళి, దొడ్ల కోటి, చిలుక మల్లయ్య, తుమ్మేటి సురేందర్‌రెడ్డి, లక్ష్మన్, కుమార్, శాస్త్రాల రాజు, మహేందర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంపత్‌కుమార్ యాదవ్

భూపాలపల్లి రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి, నులి పురుగుల నివారణ కోసం ముందస్తుగా టీకాలు వేయించడం తప్పనిసరి అని జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని కాసీంపల్లి గ్రామంలో మండల పశువైద్యాధికారి తిరుపతి ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంపత్‌కుమార్ హాజరై టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మంగలిపల్లి తిరుపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే అన్ని చట్టాలకు మూలం



మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి అర్బన్: భారతదేశంలోని హిందువులకు భగవద్గీత, ముస్లింలకు ఖురాన్, క్రైస్తవులకు బైబిల్ పవిత్ర గ్రంథాలు అయినట్టే భారతీయులందరికీ పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి అన్నారు. మహిళలు, పిల్లలకు సంబంధిచిన చట్టాలపై స్థానిక సంఘమిత్ర డిగ్రీ, పీజీ కాలేజీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్జి జయరాంరెడ్డి హాజరై మాట్లాడుతూ.. దేశంలో ఉన్నటువంటి అన్ని చట్టాలకు మూలం భారత రాజ్యాంగం అన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు. మహిళలను పట్టి పీడిస్తున్న వరకట్నం, గృహ హింస నశించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం కొడుకులతో పాటుగా కూతుర్లకు కూడా తల్లిదండ్రుల ఆస్తిలో వాటా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ గార్లపాటి ప్రియాంక, న్యాయవాదులు నెహ్రూనాయక్, రఫీక్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిశోరామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కిశోరామృతం పంపిణీ చేస్తున్న సర్పంచ్

చిట్యాల: కిశోరామృతాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఇరుకులపాటి పూర్ణ చందర్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో మండల కేంద్రంలోని మూడు, నాలుగు, ఐదవ అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 నుంచి 18 సంవత్సరాల బాలికలకు పోషణ రక్తహీనత తగ్గించుటకు కిశోరామృతాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కట్కూరి పద్మ నరేందర్, దబ్బెట అనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుపతి, టీచర్ నవత, సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడి టీచర్‌లు భాగ్యలక్ష్మీ, అరుణ, జ్యోతి, ఆయాలు పద్మ వినోద, శైలజ, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న శ్రీనాథ్

చిట్యాల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఏహెచ్‌టీయూ (అంటి ఉమేన్ ట్రాఫీకింగ్ యూనిట్) సిబ్బంది పీ.సీ శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏహెచ్‌టీయూ జిల్లా ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల కార్మిక, మానవ అక్రమ రవాణా, గంజాయి నివారణ, మహిళలపై జరుగుతున్న దాడుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నంతగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయురాలు నీలిమారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సుంకరి వాటాదారులకు న్యాయం చేయండి



భిక్షాటన చేస్తున్న సుంకరుల వాటాదారులు

టేకుమట్ల: సుంకరి వాటాదారులకు న్యాయం చేయాలని శుక్రవారం మండల కేంద్రంలో సుంకరి వాటాదారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భిక్షాటన చేసి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సుంకరులను వీఆర్ఏలుగా గుర్తించి ఉద్యోగాలను కల్పించడం హర్షించదగ్గ విషయమే కానీ అసలుదారుకే ఉద్యోగం కల్పిడం వల్ల వాటాదారులకు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల సుంకరుల వాటాదారులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



వైద్యశిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

మొగుళ్లపల్లి: ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని జెడ్పీటీసీ జోరుక సదయ్య, సర్పంచ్ ప్రేమలత అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పర్లపల్లి గ్రామ పంచాయతీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకట్ స్వామి, పంచాయతీ కార్యదర్శి నాగార్జున వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరనిలోటు



సంతాప సభలో మాట్లాడుతున్న నాయకులు

మల్హర్: మండలంలోని తాడిచర్లలో తెలంగాణ యుద్ధనౌక, ప్రజా గాయకుడు గద్దర్ సంతాప సభను శుక్రవారం నిర్వహించారు. వార్డు సభ్యుడు బండి స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులు తదితరులు మాట్లాడారు. గద్దర్ అకాల మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో తనదైన ముద్ర వేసిన ఆయన సేవలు ఎంతో మందికి ఆదర్శమని వెల్లడించారు. అనంతరం గద్దర్ చిత్ర పటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ బండి రాజయ్య, సర్పంచ్‌లు సత్తయ్య, విజయనాగేశ్వర్‌రావు, మమత నర్సయ్య, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల అధ్యక్షుడు చింతలపల్లి కుమార్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ముడతనపల్లి ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు బండి సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు బాపు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.